క్లుప్తంగా

బస్సు సౌకర్యంపై పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎం స్వాతి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలంలోని పలు గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యంపై జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.స్వాతి బుధవారం పరిశీలించారు. లద్నూరు, మద్దూరు, రేబర్తి, వల్లంపట్ల, బైరాన్‌పల్లి గ్రామాలను సందర్శించి గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రహదారుల స్థితిని పరిశీలించారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల బస్సులు రద్దీగా మారాయని, మరిన్ని ట్రిప్పులను పెంచాలని, అలాగే గతంలో ఉండే జనగామ–బైరాన్‌పల్లి బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాన్నారు. ఆమె వెంట జనగామ డిపో కంట్రోలర్ టీబీఎస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లేశం, ఉపేందర్, బాపురాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణానికి నిధులివ్వండి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు పోల్కమ్మ చెరువులోకి దేవాదుల నీటిని తరలించేందుకు వీలుగా పల్లెవాగుపై అబ్బోల్ల చింతల వద్ద చెక్ డ్యామ్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి బుధవారం పలువురు ఆకునూరు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆగంరెడ్డి, అశోక్, భూమయ్య, రాజు, నానిబాబు, రఘువీర్, సుదర్శన్, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, శ్రీకాంత్, కొమురయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత



బీరువాను అందజేస్తున్న రాధాకృష్ణ

గజ్వేల్: లయన్స్ క్లబ్ విజ్‌డమ్ ఆధ్వర్యంలో మండలంలోని బంగ్లావెంకటాపూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం బీరువాను అందజేశారు. లయన్ రాధాకృష్ణ తన సతీమణి పద్మజ జన్మదినం సందర్భంగా ఈ బీరువాను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ గోలి సంతోష్‌కుమార్, జోన్ చైర్ పర్సన్‌లు నేతి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, లయన్స్ క్లబ్ విజ్‌డమ్ గజ్వేల్ శాఖ అధ్యక్షుడు జూపల్లి సుధాకర్, ప్రతినిధులు సంజయ్‌గుప్త, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుగురు నూతన ఉపాధ్యాయులు



నియామక పత్రం చూపుతున్న ప్రభుదాసు

దుబ్బాక: మండలానికి నూతనంగా ఏడుగురు ఉపాధ్యాయులు నియామకం అయినట్లు ఎంఈఓ జోగు ప్రభుదాసు తెలిపారు. వారికి బుధవారం నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు.

ఆధునిక పరిజ్ఞానంతో శిక్షణ



ప్రిన్సిపాల్ కనకయ్య

దుబ్బాకటౌన్: యువతలో శిక్షణ నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ఐటీఐలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందజేస్తున్నామని దుబ్బాక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టాటా టెక్నాలజీ సహకారంతో ఐదు ట్రేడ్‌లలో శిక్షణ అందజేస్తున్నామని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో కుక్కునూర్ పల్లి ఐటీఐకి హాజరు కావాలని, 19వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని జగ్గు మల్లారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడుతున్నానన్నారు. తాను 30 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, సునేన తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగర్‌లో అసంపూర్తిగా నిలిచిన గౌడ సంఘం భవనం



అర్ధాంతరంగా నిలిచిన కమ్యూనిటీ భవన నిర్మాణం

ఆ భవనాలకు మోక్షం ఎప్పుడో!

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్‌లో గౌడ కమ్యూనిటీ, వడ్ల కమ్మర కమ్యూనిటీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.6లక్షలు నిధులు మంజూరు చేసింది.

● అందుబాటులోకి తేవాలి: గ్రామస్తులు

2015లో వడ్ల, కమ్మర కమ్యూనిటీ భవనం, అలాగే 2021లో గౌడ కమ్యూనిటీ హాల్‌కు అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పనులుచేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో ఆ భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. భవన నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా సంఘాల నేతలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర



సిద్దిపేటఅర్బన్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సిద్దిపేటఅర్బన్/కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర దక్కుతుందని మందపల్లి మాజీ సర్పంచ్ కొమ్ము రాజయ్య సూచించారు. మండలంలోని మందపల్లిలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో రాజవెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జ్యోతి, సరిత, సీసీ హనుమంతరెడ్డి, ఆర్ఐ నర్సింహులు పాల్గొన్నారు. కోహెడ రూరల్ మండలంలోని సముద్రాల, వెంకటేశ్వరపల్లి, చెంచెర్వుపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ పేర్యాల దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ మల్లికార్జున్, డైరెక్టర్‌లు మనెమ్మ, తిరుపతి పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

తొగుట సీఐ లతీఫ్



కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్)/కోహెడరూరల్(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/ములుగు(గజ్వేల్): యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. కుకునూరుపల్లిలోని పాఠశాలలో కనువిప్పు కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్, సైబర్ నేరాలు, బాలికలు, మహిళల కోసం ఉన్న చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, ఎంఈఓ సత్తయ్య, ఏఎస్ఐ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోహెడ రూరల్ మండలం సముద్రాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కోహెడఎస్ఐ పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కళాబృందం సభ్యులు పలు అంశాలపై ప్రజలకు చైతన్యం కల్పించారు. ఎస్ఐ పి.నీరేష్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో బాలు, రాజు, తిరుమల, శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి, ప్రకాశ్, శైలజ పాల్గొన్నారు. దుబ్బాకటౌన్‌లోని సరస్వతి గ్లోబల్ పాఠశాలలో ఎస్ఐ గంగరాజు షీటీమ్, మహిళ రక్షణ, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం రమేశ్ తదితరులున్నారు. అదే విధంగా ములుగు మండలంలోని తున్కిబొల్లారం ఉన్నత పాఠశాలలో ఎస్ఐ విజయ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, హెచ్ఎం శ్రీలత పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టండి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యులు రాములమ్మ శ్రీరాంరెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలను, అభివృద్ధిని చూసే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకుపోవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ మంజులమహేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు లోకేశ్, యుత్ నాయకులు మహేందర్‌రెడ్డి, మనోజ్, కరుణాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

'వృత్తి విద్య'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవరాజ్ చెప్పారు. పట్టణంలోని షాపింగ్ మాల్, టైలరింగ్ దుకాణాలకు విద్యార్థినులను తీసుకువెళ్లి బుధవారం అవగాహన కల్పించారు. ఫ్యాషన్ డిజైనింగ్‌పై పూర్తి అవగాహన కోసం ఇలా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

దుబ్బాక ఏడీఈగా గంగాధర్



గంగాధర్

దుబ్బాకటౌన్: దుబ్బాక నూతన విద్యుత్ ఏడీఈగా గంగాధర్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన పండరి బదిలీపై హుస్నాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా గంగాధర్ మట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా రూ.22వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు



సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతున్నాడు. నాలుగు రోజుల క్రితం అపస్మారక స్థితిలో ఉన్న సుమారు 70 నుంచి 75 యేళ్ల వృద్ధుడిని అంబులెన్స్ సిబ్బంది ఆసుపత్రిలో చేర్చారు. అతడు అపస్మారక స్థితిలో ఉండడంతో ఏ వివరాలు లభించలేదు. కుటుంబ సభ్యులు, ఇతరులు ఎవరైనా వృద్ధుడిని గుర్తిస్తే ఆస్పత్రిలో సంప్రందించాలని పోలీసులు తెలిపారు.

చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



పారిశుద్ధ్య కార్మికుడితో మాట్లాడుతున్న ఆశ్రిత్

సిద్దిపేటజోన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటా చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఇంటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక నాసర్‌పూరలో చెత్త సేకరణ వాహనం సక్రమంగా రావడం లేదన్న ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, జవాన్లు, సిబ్బందితో మాట్లాడి ఆరా తీశారు. ప్రతిరోజూ తప్పనిసరిగా చెత్త సేకరణ వాహనాలు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో పారిశుద్ధ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల్లో పేరుకున్న చెత్త, మట్టిని తొలగించాలని సూచించారు.

మెరుగైన విద్యతోనే సత్ఫలితాలు సాధ్యం

డీఐఈఓ రవీందర్‌రెడ్డి



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులకు మెరుగైన విద్య నందిస్తేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, రికార్డులను పరిశీలించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఇంటర్‌మీడియెట్ స్థాయిలో క్రమశిక్షణతో మెలిగిన ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణిస్తారని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శారద, లెక్చర్లు రామచంద్రయ్య, చంద్రయ్య, నరేందర్, సంతోష్, కన్నయ్య, సంధ్య, రేణుక, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కాతమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగాలు



అభినందిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు. మండల పరిధిలోని లింగుపల్లికి చెందిన పేదరైతు జోగ్యారి బుచ్చవ్వ, బాల్‌నర్సు దంపతుల కూతురు రాజేశ్వరి, కొడుకు చందు ఏఈఈ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం వారిని అభినందించారు.

విలువలతో కూడిన విద్య అవసరం



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు సంస్కారం, విలువలతో కూడిన విద్యను అందించాలని డీఈఓ ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నర్మేట ఉన్నత పాఠశాలలో బుధవారం ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం ప్రభుత్వ పాఠశాలల పనితీరుకు నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోని హైస్కూల్‌లో 1988–89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35 యేళ్ల తరువాత కలుసుకున్న వారంతా సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు గుడిమల్ల శ్రీనివాస్, భూలక్ష్మి, పొర్ల మల్లయ్య, రవీందర్, పద్మ, నర్సింహారెడ్డి, సుధాకర్, సరిత, అరుణ, కృష్ణవేణి, రమాదేవి, అంజయ్య, రాజయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన రుక్సానాబీకి రూ.8500, బంజేరుపల్లి రేణుకకు రూ.12వేలు మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి ఉన్నారు.

◆ **ధర్నా విజయవంతం కావాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): వరంగల్‌లో గురువారం నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్‌లకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కన్వర్షన్ చేసి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 23వేల మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక ఆందోళన చెందుతున్నారని, వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

◆ **నేషనల్ కాంగ్రెస్ వారియర్ జిల్లా అధ్యక్షుడిగా అశోక్**

మిరుదొడ్డి(దుబ్బాక): నేషనల్ కాంగ్రెస్ వారియర్ జిల్లా అధ్యక్షుడిగా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన గజభింకార్ అశోక్ నియామకమయ్యారు. సౌత్ ఇండియా ఇన్‌చార్జి లక్ష్మీనాయర్ బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

కొండపాక(గజ్వేల్): స్థానిక మోడల్ స్కూల్లో గంటల ప్రాదిపదికన పీజీటీ ఆంగ్ల మాధ్యమం, టీజీటీ హిందీలో బోధించేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ కోరారు. దరఖాస్తు చేసుకునేవారు ఆంగ్ల మాధ్యమానికి పీజీటీ ఇంగ్లిష్, ఏంఏ ఇంగ్లిష్, బీఈడీ; హిందీ పోస్టునకు ఏంఏ హిందీ, బీఈడీ, లేదా హెచ్‌పీటీ అర్హత ఉన్నవారై ఉండాలన్నారు. గతంలో ఆదర్శ పాఠశాలలో పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు 18న నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

◆ **పిడుగు పాటుకు రెండు ఎద్లు మృతి**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో బుధవారం ఉదయం పిడుగు పడడంతో రెండు ఎద్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గజ్వేల్ ముత్యాలు తండ్రి రాములుకు చెందిన రెండు ఎద్లు కొట్టంలో కట్టేసి ఉన్న సమయంలో వర్షంతో పాటు పిడుగుపడింది. దీంతో ఎద్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మండల గిర్దావార్ ప్రభాకర్‌రావు, వెటర్నరీ డాక్టర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

◆ **బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ**

మిరుదొడ్డి(దుబ్బాక): బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మండల అధ్యక్షుడు లింగాల వెంకట్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన ఫకీర్ పాషా కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ ఎల్లేశం, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, యూత్ అధ్యక్షుడు జయరాజు, నాగరాజు, షాబుద్దీన్, సలీమ్ తదితరులు ఉన్నారు.

◆ **కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎంపిక**

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏర్పాటైంది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొత్త రాజు, ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధానకార్యదర్శిగా ఆశయం, అధికార ప్రతినిధిగా రాజిరెడ్డి, కార్యదర్శులుగా యాదగిరి, శ్రీకాంత్, కోశాధికారిగా సత్యనారాయణ, సలహాదారులుగా సత్యనారాయణ, బుచ్చయ్య, శంకరయ్య, రాజిరెడ్డి, దేవయ్య, రంజిత్ ఎంపికయ్యారు.

◆ **అనస్తీషియా డే**

సిద్దిపేటకమాన్: అనస్తీషియన్ విభాగ వైద్యులు బాగా పనిచేస్తున్నారని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ ప్రశంసించారు. వరల్డ్ అనస్తీషియా డేను పురస్కరించుకుని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వైద్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ సేవలు, శస్త్ర చికిత్సలలో అనస్తీషియన్ వైద్యుల సేవలు కీలకమైనవన్నారు. కార్యక్రమంలో అనస్తీషియా విభాగ హెచ్ఓడీ అనుపమ, అసోసియేట్ ప్రొఫెసర్, డిప్యూటీ సూపరింటిండెంట్ చందర్, ఇతర వైద్యులు ఝాన్సీ, దేవేందర్, ప్రతాప్ పాల్గొన్నారు.

◆ **నేడు ఎమ్మెల్యే పర్యటన**

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండలంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 1 గంటకు కాన్గల్, పెద్ద మాసాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తారని, అనంతరం కాన్గల్‌లో వైకుంఠధామం, ఫ్రీజర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ **ప్రైవేటు వాహనాలకు సైరెన్‌లు వద్దు**

సిద్దిపేటకమాన్: ప్రైవేటు వాహనాలకు పోలీసు సైరెన్‌లు అమర్చితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని కార్ డెకార్ దుకాణదారులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా కొందరు ప్రజా ప్రతినిధులు తమ వాహనాలకు పోలీసు సైరెన్‌లు బిగించుకుని తిరుగుతున్నారన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొన్నింటిని తొలగించామని చెప్పారు. ప్రైవేటు వాహనాలకు ఎలాంటి సైరెన్‌లు అమర్చవద్దని కార్ డెకార్ దుకాణదారులకు సూచించారు. ఎవరైనా అలాచేస్తేచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

◆ **విద్యుత్‌శాఖ డీఈగా రామచంద్రయ్య**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్‌శాఖ సిద్దిపేట డివిజన్ ఇంజనీర్‌గా రామచంద్రయ్య బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మహేశ్‌కుమార్ హైదరాబాద్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

◆ **ఆహారాన్ని దుర్వినియోగం చేయొద్దు**

గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్కరు ఆహారం విలువను తెలుసుకోవాలని, దానిని దుర్వినియోగం చేయకూడదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా బాలుర ఎడ్యుకేషన్ హబ్ లోగల డిగ్రీ కళాశాలలో బుధవారం మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు లావణ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు భవాని, కవిత, మార్కండేయ, రామచంద్రం, జ్యోతి, అలివేలు, పద్మ, మహేందర్, నరేశ్, శ్రీధర్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **అటవీశాఖ సెక్షన్ అధికారి మృతి**

బాన్సువాడ: కామారెడ్డి జిల్లా బాన్సువాడ అటవీ రేంజ్ పరిధిలోని నిజాంసాగర్ సెక్షన్ అధికారి గులాం దస్తగిరి(58) బుధవారం ఉదయం బాన్సువాడ ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. సిద్దిపేట్ జిల్లా ములుగుకు చెందిన గులాం దస్తగిరి నిజాంసాగర్ సెక్షన్ అధికారిగా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లేందుకు ఆయన సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు.

◆ **పంట కాలువల పరిశీలన**



కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం గ్రామంలో మధ్యతరహా ప్రాజెక్టు నుంచి వెళ్లే పంట కాలువలను డీఈ రేష్మ, తహసీల్దార్ సురేఖ బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టుకు ఎంత ఆయకట్టు ఉంది, ఎన్ని ఎకరాలకు నీరు అందుతోందనే దానిపై అంచనా వేశారు. ప్రాజెక్టు నీటితో ఎలాంటి పంటలు పండిస్తున్నారని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ రవీశ్, ఆర్ఐ బలయ్య తదితరులు పాల్గొన్నారు.